www.aksharamtelugudaily.com
అక్షరం
సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక
అనుబంధ సంచిక
సోమవారం 23, సెప్టెంబర్ 2024 పేజీలు : 3




# ఆటో కార్మికులను ఆదుకోవాలి

- మహాలక్ష్మి పథకంతో నష్టపోయిన ఆటో, క్యాబ్ కార్మికులు
- సంక్షేమబోర్డు కోసం కేంద్రంపై రవాణారంగా కార్మికులు పోరాడాలి
- అన్ని వసతులపై జీఎస్టీ విధిస్తున్న కేంద్రం పెట్రోల్, డీజిలుపై ఎందుకు జీఎస్టీ విధించరో సమాధానం చెప్పాలి
- రవాణారంగ కార్మికులపై భారాలు మోపుతున్న మోడీ సర్కారుపై ఉద్యమించాలి
- కార్మికవర్గం పక్షాన ఏఐటీయూసీది సుదీర్ఘ పోరాట చరిత్ర
- కార్మికుల హక్కులు సాధించేది ఎర్రజెండానే సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే : కూనంనేని సాంబశివరావు
- ఆటో వర్కర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర మహాసభ సందర్భంగా ఎరుపెక్కిన కొత్తగూడెం పట్టణం, ఆటోలతో భారీ ర్యాలీ

**భద్రాద్రి జిల్లా/ కొత్తగూడెం/ అక్షరం న్యూస్:** ఆర్టీసీ సంస్థకు ధీటుగా మారుమూల పల్లెలకు సైతం ప్రజలకు ప్రయాణ సేవలందిస్తున్న ఆటో, క్యాబ్ కార్మికులను ఆదుకోవాల్సిన భాద్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని, ఆ భాద్యతను విస్మరించి పన్నులు, ఫైన్ల పేరుతో కార్మికులను దోచుకునే పనిలో పాలకులు ఉన్నారని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఏఐటీయూసీ అనుబంధ ఆటో, క్యాబ్ అండ్ ప్రైవేట్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర తృతీయ మహాసభలు కొత్తగూడెం పట్టణంలోని కొత్తగూడెం క్లబ్బులో ఆదివారం ప్రారంభమయ్యాయి. మహాసభల ప్రారంభం సందర్బంగా లక్ష్మీదేవిపల్లి మండలం మిగతా2 లో..





## కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణ

# అధ్వానం

- రోగులకు వైద్య సహాయం అటుంచితే, పరిసరాలు కంపు కొడుతున్నాయి
- ఆసుపత్రి ఆవరణలోనే మందు బాబులు తాగి దొర్లుతున్నారు
- రోగాలతో సతమతమవుతూ ఆసుపత్రి ఆవరణలోనే కొట్టు మిట్టాడుతున్న వృద్దులు
- జిల్లా కలెక్టర్ సారు...దృష్టి సారించాలని కోరుతున్న నిరూ పేద ప్రజలు

**భద్రాద్రి జిల్లా/కొత్తగూడెం/ జిల్లా/ కొత్తగూడెం/ అక్షరం న్యూస్:** వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలసత్వంతో... కొత్తగూడెం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి నిర్వహణ అగమ్య గోచరంగా మారింది. ఆసుపత్రి అభివృద్ధి కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితం అయింది. అనారోగ్య సమస్యలతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇక్కడ వింత అనుభవం ఎదురౌతుంది . ఇక్కడి వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్ల నిరుపేదలు ప్రభుత్వ వైద్యం అందక, అందినా మందులు దొరకక నరక యాతన అనుభవిస్తున్నారు. పరిశుభ్రత పై పాఠాలు చెప్పే మిగతా2 లో..



# పిల్లలకు విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ నేర్పాలి

- అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్
- 10వ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధనకు కృషి
- ఏన్కూర్ మండల కేంద్రంలో కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



**ఖమ్మం/ తల్లాడ (అక్షరంన్యూస్):** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో చదువు కుంటున్న పిల్లలకు చిన్నతనం నుంచే విద్యతో పాటు క్రమశిక్షణ, మంచి విలువలు మొదలైనవి నేర్పించాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ తెలిపారు. ఆదివారం అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ ఏన్కూర్ మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని కిచెన్, డార్మెటరీ మొదలగు ప్రదేశాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థినులకు విద్యా బోధన చేశారు.దఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో బాలికలకు మంచి విద్యతో పాటు క్రమశిక్షణ విలువలు నేర్పాలని తెలిపారు. చిన్నతనం నుంచి మంచి విలువలతో కూడిన మోరల్ కథలు బోధించాలని అదనపు కలెక్టర్ సూచించారు.కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారం అందించాలని అన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల మిగతా2 లో..

# కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణ అధ్వానం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ అధికారులకు ఇక్కడి ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలు కనబడట్లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**ఆసుపత్రి ఆవరణలో హృదయవిదారక దృశ్యాలు**



కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్మించిన "టి"హాబ్ కు రోజు వేల సంఖ్యలో రక్త నమూనాలు వస్తుంటాయి. వాటి సేకరణ సులభతరం చేసేందుకు టి హబ్ కు పక్కన నిర్మించ తలపెట్టిన భవనం సంవత్సరాలుగా అసంపూర్తిగానే ఉండడంతో అది కాస్త మందుబాబులకు అడ్డాగా మారింది. అక్కడ రోజు రాత్రి సమయాల్లో మందుబాబుల సంచారం ఎక్కువగా ఉంటుందని రోగులు వాపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు రాత్రి సమయాల్లో ఆసుపత్రికి అటుగా రావాలంటేనే బయపడుతున్నారు. ఇక ఇక్కడ సెక్యూరిటీ కూడా అంతంత మాత్రమేనని వాపోతున్నారు. ఇక ఆసుపత్రి ప్రాంగణంలో రోగాలతో సతమతమవుతూ బాధపడుతున్న వృద్ధులను ఎలాగైనా వదిలించుకోవానే వికృత మనుషులు వారిని అక్కడే వదిలేసి వెళ్లడంతో వారు పడే బాధలు వర్ణాతీతం, వారి పరిస్థితి చూస్తే హృదయం ఉన్నవాళ్లకు చూడ లేని సంఘటనలు ఎన్నో అక్కడ కనిపిస్తాయి. ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణ అటుంచితే రోజు ఇక్కడ విద్యాభ్యాసం కోసం మెడికల్ కళాశాల విద్యార్థినులు, టి హబ్ లో ఎమ్మెల్టి, ఏ ఎన్ఎం తదితర కోర్సులు నేర్చుకునేందుకు విద్యార్థినిలు వస్తుంటారు. వీరి రక్షణ ప్రభుత్వ బాధ్యత కాదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. కలకత్తా తరహా సంఘటనలు జరిగితే కానీ స్పందించరా అని వాపోతున్నారు. ఇక నైనా జిల్లా కలెక్టర్, వైద్యారోగ్య శాఖ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ ఆసుపత్రి నీ సందర్శించి ఇక్కడికి వచ్చే రోగులకు మెరుగైన సౌర్యాలు కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

**వృద్ధులను రక్షించేందుకు పోలీసులు చొరవ చూపాలి..**

అనారోగ్య సమస్యలతో బాధపడుతూ కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో దుర్భర జీవితం గడుపుతున్న వృద్ధులను స్థానిక పోలీసులు రక్షించాలని పలువురు కోరుతున్నారు. వారిని వృద్యాప్యంలో అలా వదిలేసి వెళ్లిన కుటుంభ సభ్యులను వెతికి వారిని అపోతాగించాలని , వారి పూర్తి బాగోగులు కుటుంభ సభ్యులే చూసుకునేలా వారికి కౌన్సిలింగ్ ఇచ్చి వారి పట్ల దయ చూపాలని పలువురు కోరుతున్నారు.

## విద్యతో పాటు పిల్లలకు విలువలు, క్రమశిక్షణ నేర్పాలి

(మొదటి పేజీ తరువాయి)





విద్యాలయాల్లో 10వ తరగతి విద్యార్థినులు పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రణాళికాబద్దంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్, ఓటరు నమోదు, మార్పులు చేర్పులకు సంబంధించి దరఖాస్తుల పరిశీలన, స్వీకరణకై చేపడుతున్న ఇంటింటి సర్వే ప్రక్రియను తనిఖీ చేశారు. ప్రక్రియ వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికులను ఆదుకోవాలి






(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి కొత్తగూడెం క్లబ్బు వరకు కార్మికులు తమ ఆటోలు, ప్రైవేట్ వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్మికులు ప్రదర్శించిన ఎర్ర జెండాలతో కొత్తగూడెం పట్టణం ఎరుపెక్కింది. క్లబ్ ఆవరణలో ఏఐటీయూసీ జాతీయ నాయకులు వి ఎస్ బోస్ జెండాను ఎగురవేసి మహాసభలను ప్రారంభించారు. మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రవాణారంగ కార్మికులను దోచుకోవడమే పనిగా పెట్టుకుందని, రోడ్డు సేఫ్టీ చట్టాలు, అపరాధ రుసుములు, పన్నుల పేరుతో కార్మికుల జేబులు కొల్లగొడుతూ ఖజానా నింపుకుంటోందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచి కార్మికులపై భారం మోపుతున్నారని, అన్ని వసతులపై జీఎస్టీ విధిస్తున్న కేంద్రం పెట్రోల్, డీజిలుపై ఎందుకు జీఎస్టీ విధించరో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఈ విధానం ఇంధన కంపెనీలకు మేలుచేసేందుకేనని విమర్శించారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు తరహాలో దేశవ్యాప్తంగా లక్షలాదిగా ఉన్న రవాణారంగ కార్మికుల సంక్షేమ కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఉద్యమిస్తున్న కేంద్రం పెడచెవిన పెడుతోందని విమర్శించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై తిరగబడితేనే న్యాయం జరుగుతుందని కూనంనేని అన్నారు. ఏఐటీయూసీ అనుబంధంగా ఏర్పడిన ఆటోరిక్షా వర్కర్స్ యూనియన్ ఐదు దశాబ్దాలుగా కార్మికుల పక్షాన పోరాడుతోందని, అనేక హక్కులు సాధించిపెట్టిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో నష్టపోయిన ఆటో, క్యాబ్ కార్మికులకు ప్రతి నెల రూ. 12వేల ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని, భీమా సౌకర్యం కల్పించాలని, బీమాను రూ. 10లక్షలకు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో రవాణా రంగ కార్మికుల ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడేందుకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కంచర్ల జమలయ్య అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఏఐటీయూసీ ఎస్ కె సాబీర్ పాషా, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు వి ఎస్ బోస్, ఎస్ బలరాజు, బి వెంకటేష్, నరాటి ప్రసాద్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. మహాసభలో సీపీఐ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ముత్యాల విశ్వనాథం, కె సారయ్య, కల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్ డి సలీం, సలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, పెరబోయిన మోహన్ రావు, దేవరకొండ శంకర్, వి పూర్ణచందర్ రావు, జి రామకృష్ణ, భూక్య దస్రు, కందుల భాస్కర్, రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ఆటో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.




- నష్టపోయిన..మత్స్యకారులు...
- కోలుకోలేని విధంగా మత్స్యకారు సంఘాలు...
- కొట్టుకుపోయిన.. అడ్డుపెట్టిన వలలు..
- సుమారు 20 లక్షలపైగా నష్టం..
- కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి..
- ఖమ్మం జిల్లా ముదిరాజ్ సంఘం యూవజన జిల్లా అధ్యక్షులు తవడబోయిన కృష్ణ ముదిరాజ్

# వరద పాలైన.. జల పుష్పాలు...

**ఖమ్మం/ తల్లాడ (అక్షరంన్యూస్):** ఇటీవల మండలంలో భారీ వర్షాలు మత్స్యకారులను దెబ్బతీశాయి. కొన్ని గంటల్లోనే ఊహించని విధంగా వచ్చిన వరదలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. తిరుమలాయపాలెం మండల పరిధిలోని గ్రామాలకు సంబంధించిన చెరువులలో మత్స్యకారులు కొన్నేళ్లుగా చేప పిల్లలు పోసి పెంచుతున్నారు. 20 రోజుల క్రితం వచ్చిన వరదలలో చెరువులలోని చేపలు చెరువులు అలుగు పోయడంతో చెరువులకు రక్షణగా అడ్డుపెట్టిన వలలు తెగిపోయి మత్స్యకారులు రోడ్డున పడ్డారు. తిరుమలయపాలెం మండలం కాకరవాయి గ్రామం లోని మద్దుల చెరువు, గుడి చెరువులొ గ్రామానికి చెందిన మత్స్యకారుల సొసైటీ ఆధ్వర్యంలో చెరువులలో సుమారు ప్రస్తుతం మూడు లక్షల రూపాయల చేపలు , గతంలో పోసిన చేపలు సుమారు 20 లక్షల రూపాయల విలువగల చేపలు చెరువులు అలుగు పోయడంతో కొట్టుకుపోయి నష్టపోయామని మత్స్యకారులు. వాపోతున్నారు. ఈ రెండు చెరువులకు 125 మంది సభ్యులు ఈ రెండు చెరువులలొ చేపల విక్రయం ద్వారా వచ్చే ఆదాయంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తుంటారు.

ఇంతటి నష్టం జరగడంతో బ్రతికేది ఎలా అని గోడున విలపిస్తున్నారు.

## మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి..

వరదల కారణంగా మత్స్యకారులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారని,ప్రతి చెరువు కుంటలకు రక్షణగా అమర్చిన వలలు కొట్టుకొని పోవడం వలన టన్నుల కొద్దీ చాపలు బయటకు వెళ్లిపోయాయని విచారం వ్యక్తం చేస్తున్నారు.మత్స్యకార సంఘాలన్నీ కోలుకోలేని పరిస్థితిలో ఉన్నాయని ప్రభుత్వమే వారిని ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు వేడుకుంటున్నారు. ప్రతి మత్స్యకారుడికి 20 వేల రూపాయల ఆర్థిక సహాయం, కొట్టుకుపోయిన వలలకు 40 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయాలని ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నారు.



## ప్రభుత్వం ఆదుకోవాలి..



కాకరవాయి గ్రామంలోని రెండు సొసైటీ చెరువులు ఇటీవల కురిసిన వర్షాలకు అలుగులు పోసి వలలు తెగిపోయి చెరువులలో ఉన్న టన్నుల కొద్దీ చేపలు కొట్టుకుపోయి రోడ్డున పడ్డాం. చెరువుల మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న మాకు, పంట నష్టం మాదిరిగా, జరిగిన నష్టాన్ని అంచనా వేసి సొసైటీలకు పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాం.

– ఖమ్మం జిల్లా ముదిరాజ్ సంఘం యూవజన జిల్లా అధ్యక్షులు తవడబోయిన కృష్ణ ముదిరాజ్

## మత్స్యకారులకు ఆర్థిక నష్టం ఇవ్వాలి..



నా పేరు మోర బిక్షం మా ఊరు కాకరవాయి గ్రామం కురిసిన వర్షాలకు మద్దుల చెరువు, గుడ్డి చెరువు ఈ సంవత్సరం చాప పిల్లలు పోషినం, రెండు మూడు ఏళ్ల నుంచి కూడా చాపలు పట్టడం లేదు అవి కూడా చెరువులోనే ఉన్నాయి. మొన్న కురిసిన వర్షాలకు చెరువులు నిండి అలుగు పారడం వల్ల చాపలన్నీ బయటికి వెళ్లిపోయినయ్, రెండు చెరువుల పేరు మీద సుమారు 20 లక్షల నష్టం వచ్చింది. మత్స్యకారులను రోడ్డున పడ్డం.ప్రభుత్వం ఆదుకొని సొసైటీ సభ్యత్వం దారులకు ఆర్థిక నష్టం 20 వేల రూపాయలు ఇయ్యాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

– మోర బిక్షం